కాంతమ్మ ఇంత ఉప్పు దిగతుడిచి పారేసి—దేవుడి గూట్లోంచి విబూది పట్టుకొచ్చి పెట్టింది.

మీరా తల్లి చేసేవి చూస్తూ కూర్చుంది.

ఇంకో అయిదు నిముషాలు ఏడిచి విజయ్ పాలసీసా పట్టుకున్నాడు,

మీరా కళ్ళనుండి ధారాపాతంగా నీళ్లు కారుతూనే వున్నాయి—విజయ్ పాలు తాగుతోంటే చూస్తూ కూర్చుంది.

కాంతమ్మ మళ్ళీ వచ్చి, "పాలు తాగుతున్నాడా" అని అడిగింది.

"ఊఁ" అంది.

కాంతమ్మ మంచం దగ్గరగా వచ్చి "అలా వున్నావేం?" అడిగింది.

"ఎలా వున్నాను" అనో "ఏం లేదు" అనో అనాలనుకుంది. కాని ఒక్కటీ అనలేక పోయింది. గొంతు పెగల్లేదు.

ఆవిడ మంచంమీద కూర్చుని మీరా తలమీద చెయివేస్తూ "ఏమిటమ్మా!" అంది ఆప్యాయంగా.

మీరాకి దుఃఖం ఆగలేదు. అపుకోవాలని ఎంతో ప్రయత్న చేస్తోంది. తల్లి అలా దగ్గరగా వచ్చి "ఏమిటమ్మా" అని ఎప్పుడైనా అడిగిందా? ఇప్పుడలా అడిగేసరికి మీరా దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

కాంతమ్మ కంగారుపడిపోయింది. "ఏమిటి మీరా! ఏమయింది?" ఆదుర్దాగా అడిగింది.

మీరా మాట్లాడలేదు. దోసిట్లో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

కాంతమ్మ కూతురి భుజాల చుట్టూ చేతులువేసి దగ్గరగా తీసుకుంటూ అడిగింది "ఏమిటి, ఎందుకు మీరా! నాతోటి ఏమీ చెప్పవుకదా! నాకెలా తెలుస్తుంది?" అంది.

"విజయ్ అలా ఏడుస్తోంటే...." ఏడుపు గొంతుతో ఎలాగో అంది.

"దానికింత ఖంగారు పడతారా! పిల్లలు ఏడవరూ?"

"ఎప్పుడూ వాడిలా ఏడవలేదు—నువు చూస్తే ఇలా వున్నావు. మనం ఇక్కడనుంచి ఏ వూరయినా వెళ్ళిపోదామమ్మా! నాకీ వూళ్లో వుంటే పిచ్చి ఎక్కేటట్లుంది" వెక్కిళ్ళమధ్య అంది.

కాంతమ్మకీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "ఇంక ఏ వూరు వెళ్ళినా ఇలా పరువుగా బ్రతకలేం. పల్లె—బస్తీ కాని ఈ వూళ్లో మన సంగతి ఎవరూ పట్టించుకోవటం లేదు. నిజంగా ఈ వూరి వాళ్లు చాలా మంచివాళ్లు. వాళ్ళకి చేతులెత్తి మొక్కచ్చు....కానీ, నా తర్వాత నిన్నెవరు చూస్తారనే నా దిగులు."

మీరాకి ఇంకా దుఃఖమొచ్చింది. "మాట్లాడనే మాట్లాడవ్—మాట్లాడితే—ఇలా మాట్లాడతావు."

"కడుపు తీపి. ఏంచేయను తల్లీ! విజయ్ ఏడిస్తే—వాడు వూరుకున్నా నువ్వెంత బాధపడుతున్నావ్? లేచి కళ్లు తుడుచుకో! పొద్దున్న పడిపోయాడు కింద. పెదిమకి పైపళ్లు గుచ్చుకున్నాయి కదా. పెదిమ వాచింది. అది సలుపు పెడుతోందో ఏమో!" కాంతమ్మ తన బాధని దిగమింగి కూతుర్ని ఓదార్చింది.

తలపోటుగా వుంది. అన్నం వద్దన్నా కాంతమ్మ బలవంతంగా మీరాచేత మజ్జిగా అన్నం తినిపించింది.

మీరా విజయ్ పక్కన పడుకుంది.

(సశేషం)



సీతారాముల చిత్రపటం గోడన వ్రేలాడుతూంది. ఇవతలగా రాధాకృష్ణుల ప్రణయ చిత్రపటం గాలికి కదులుతూంది.

సన్నజాజుల పరిమళాల్ని మోసుకొస్తున్న గాలి పందిరి మంచంమీద పడుకున్న రాధారాణి చుట్టూ తిరుగుతూంది.

వీధరుగుమీద కూర్చుని పక్కింటి పార్వతమ్మ కూతురు అత్తారింటికి వెళ్ళడానికి పంచాంగం చూసి మంచిరోజు చెప్తున్నాడు తండ్రి.

రోగిష్టితల్లి మడిగట్టుకుని వంట వండుతూ శ్రీనివాస కళ్యాణ గీతాన్ని కూనిరాగం తీస్తూంది.

ఎంత అపుకుందామని ప్రయత్నించినా ఆగకుండా వస్తున్న కన్నీటిని ఓణీ చెరగుతో తుడుచుకుంటూ లేచి కిటికీ దగ్గరగా వచ్చి వీధి వైపు చూస్తూ నిలబడింది రాధారాణి.

పొలాల్లో పను ముగించుకుని గుంపులు గుంపులుగా పోతున్న కూలిజనం లొల్లాయి పదాలు పాడుకుంటున్నారు.

కిటికీకెదురుగా, రోడ్డు కావలగా వున్న ఖాళీ స్థలంలో మేకపిల్లలు తల్లిదగ్గర పాలు త్రాగుతూ చెంగుచెంగున గెంతుతున్నాయి.

ఆ స్థలం చివరగా చిన్నపాక వేసుకున్న రంగడు గోచీపెట్టుకుని స్నానం చేస్తుంటే వాడిపెళ్ళాం వీపు రుద్దుతూంది. వాడు సబ్బు నురుగు దాని మొహానికేసి రాసి నవ్వుతూంటే అది వాడి నెత్తిమీద చెంబుతో సుతారంగా మొట్టి సరిసరసం ఆడుతూంది.

సీమ చింతచెట్టు కొమ్మమీద రెండు జంట పావురాళ్ళు ఒకదాని ముక్కు నొకదాన్ని పొడుచుకుంటూ హుషారుగా రెక్కలెగరేస్తున్నాయి.

అరుణకాంతుల్ని సంతరించుకున్న ఆకాశం రాబోయే ప్రియుడికోసం ఎదురు చూసే ప్రేయసిలా వుంది.

అంత దుఃఖంలోనూ ప్రకృతి రాధారాణి మనసును ఊరడింపజేస్తూంది. వయసుతోబాటు పెరిగే అవసరాల్ని కోర్కెల్ని మటుకు రెచ్చగొడుతూంది.

చల్లనిగాలి ఒక్కసారి వచ్చి కిటికీలో నుంచున్న రాధారాణికి తగలంగానే ఒళ్ళు గగుర్పొడిచింది.

రాధారాణికి పెళ్ళిడొచ్చింది.

పెళ్ళీడు దాటి మూడేళ్ళయింది.

కాని తన పదహారవ ఏటినించీ సంబంధాలు వస్తూనేవున్నాయి. కట్నం దగ్గర బేరం కుదరక పోతూనేవున్నాయి.

సుబ్బయ్యనాయుడుగారి అమ్మాయి పురిటికని రావడం ఇది మూడోసారి? దాన్ని పలకరిద్దామని వాళ్ళింటికి వెళ్తుంటే దోవలో బోడెమ్మత్త ఎదురయి "ఇంకెన్నాళ్లే-ఒంట్లోని ఒంపులన్నీ సడలిపోయాక ఏ మగాడూ నిన్ను చేసుకోవడానికి ముందుకురాడు. ఇలాగే వున్నావంటే ఏ కాకో గద్దో ఎగరేసుకు చక్కాపోతుంది" అంది చనువుగా.

ఆ బోడెమ్మత్త నడిరోడ్డుమీద పక్కా మగరాయుడిలా ఏ కన్నెపిల్ల కనబడ్డా మొరటు సరసం ఆడేస్తుంది. నయం, రెండు మాటల్తో వదిలేసిందనుకుంది రాధారాణి.

కాస్త అటు ఇటుగా తన ఈడు వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోయి కాపురాలు చేస్తున్నారు.

తను అటు చదువుకున్నదీ కాలేకపోయింది యిటు ఇల్లాలూ కాలేకపోయింది. తనకు తెలుసు తన తండ్రి అటు చదువుకనీ యిటు పెళ్ళికనీ డబ్బు ఖర్చు పెట్టలేదు.

# చెరబడ్డ గీతం

పి. సత్యనారాయణ శాస్త్రి

కాదు-చెయ్యలేదు. ఎలాగూ పెళ్ళి చెయ్యక తప్పదు కాబట్టి పదవ తరగతితోటే చదువు ఆపించేసి ఎంత త్వరగా పెళ్ళి జరిపించిచేస్తే అంత తక్కువ అప్పులో తెరిపినపడదామన్న సంకల్పంతో పెళ్ళి సంబంధాలు వెతకటం ప్రారంభించాడు.

పెళ్ళి చూపులు జరుగుతూనే వున్నాయి. ప్రతి పెళ్ళిచూపుల్లోనూ ఇతడే గామోసు తన కాబోయే మొగుడు అనుకోవడమూ—బేరం కుదరక మరో పెళ్ళిచూపుకి సింగారించుకుని కూర్చోవడమూ జరుగుతూనే వుంది.

అది అలవాటుగా మారింది.

తనకు వయసు—వయసుతోబాటు మనసు మనసుతోబాటు కోర్కెలు పెరగడమే కాకుండా నిరాశా నిస్పృహాలు పెరగడమటుంచి రోజు రోజుకూ పెళ్ళికొడుకుల రేటు మరింతగా పెరిగిపోవడంతో పెళ్ళితలపు తనకు బాధాకరంగానూ తన తండ్రికి ఓ పెద్దసమస్యగానూ తయారయింది.

ఛీ—ఏమిటీ ఆడజన్మ అనిపిస్తూంది తనకు.

అసలెందుకీ జన్మని కూడా అనిపిస్తూంది.

చచ్చిపోతే....

చచ్చి ఏం సాధించాలి?

బ్రతికి బ్రతుకును నందనవనం జేసుకోవాలి.

ఆశ దీపమై వెలుగునిస్తూంది!

నిరాశ మసిపులుముకున్న రాక్షసై మీద కురుకుతూంది.

బ్రతుకు భారమై తోస్తూంది.

అప్పుడే వీధి దీపాలు వెలిగాయి.

ఖాళీస్థలంలోని మేక తల్లి ఏమయిందో.... పిల్లలు గెంతుతూ ఆడుకుంటున్నాయి.

గోచీ పెట్టుకుని స్నానంచేస్తున్న రంగడి స్నానం ఎప్పుడో ముగిసినట్లుంది. పాకలో దూరి పెళ్ళాంతో సరసాలాడుతున్నాడు గామోసు.

చింతచెట్టుమీది పావురాల జంట సరసాలు ఆ గూటిలోకి వెచ్చగా చేరినట్టున్నాయి.

అరుణకాంతుల్ని సంతరించుకున్న ఆకాశం ఎప్పుడు చీర మార్చిందో! — శరీరం నీలి వర్ణంగా వుంది. బహుశా ప్రియుడ్ని చేరిందేమో.

"అమ్మాయ్ రాధా! చిమ్నీలు తుడిచి దీపాలు వెలిగించు" అన్న తల్లి పిలుపుతో గది దాటి వసారాలోకొచ్చింది. ఒత్తులు సరిజేసి దీపాలు వెలిగిస్తూందేగాని మనసు మనసులో లేదు.

వారంరోజుల క్రితం తనకు జరిగిన పెళ్ళి చూపులతతంగం తాలూకు ఫలితం మధ్యాహ్నం వచ్చిన పోస్టు కవరు ద్వారా తెలిసింది. ఆ ఉత్తరాన్ని ఒకటికి పదిసార్లు చదివింది. కన్నీటితోబాటు పట్టరాని కోపం, ఉక్రోషం కూడా వచ్చాయి తనకు.

ఛీ....ఛీ....ఏంమనుషులు??

తను ఓ మాదిరిగా నచ్చిందట ....షాపులో అద్దాల మధ్య బిగించబడ్డ కీ బొమ్మలాగా. అయినా ఫరవాలేదట!—నయానో భయానో అతగాడ్ని పెళ్ళికి ఒప్పిస్తారట. ఎటొచ్చీ కట్నం దగ్గరే కాస్త ఆలోచించాల్సొస్తూందట. కనీసం కట్నం పదివేలన్నా ఇస్తే తనని ఆ ఇంటి కోడలిగా స్వీకరించడానికి ఏమాత్రం అభ్యంతరంలేదట.

కట్నం పదివేలూ యిస్తే తను పూర్తిగా నచ్చుతుందా? తనకు తానుగా తనను మెచ్చి పెళ్లాడవలసినవాడు పెద్దవాళ్ళ నయభయాల్కి తలొంచి మూడు ముళ్ళూ వేస్తాడు గామోసు. ఇటువంటి మగతనంలేనివాణ్ణి చేసుకుని తను జీవితపుటంచుల వరకూ ఎలా పయనిస్తుంది?

డబ్బుతో ప్రేమను కొనబోవడం ఎంత నీచం???

*　　*　　*

పందిరి మంచం గదికి కళొచ్చింది. కళకళలాడుతూంది. ముతకవాసన వచ్చే ఆ గది ఇప్పుడు అగరొత్తుల ఘుమఘుమలతో సువాసనల్ని వెదజల్లుతూంది.

రసికరాజులకు మత్తెక్కిస్తూంది.

మంచంమీద పూలు నలుగుతున్నాయి

పగిలిన చేతిగాజుముక్కలను, సగం కాల్చి పారేసిన సిగరెట్టు పీకలను రోజూ పనిమనిషి తుడిచి అవతల వేస్తూనే వుంది.



దేవదారు చెక్క పెట్టె అటకెక్కి దానిస్థానే గాడ్రెజ్ బీరువా హుందాగా నిలిచింది. ఇప్పుడా బీరువాలో అన్నీ ఖరీదైన వస్తువులే. అన్నీ ఖరీదైన చీరలే....

రోగిష్టితల్లికి పెద్ద డాక్టర్ల వైద్యం. రోగి తేరుకుని మొఖం తేటతెల్లంగా వుంది.

సుబ్బయ్యనాయుడిగారి ధనలక్ష్మి ఇప్పుడు రాధారాణి ఇనపబీరువాలో నిండుతూంది.

ఏమో తెలియని తెగింపు.

గుండె నల్లరాయయింది.

అది పగలదు, కరగదు.

బెదురు లేదు. చింతన లేనేలేదు.

ఇప్పుడు వెన్నెల వెలుగులు ఏటిపాలవటం లేదు.

బ్రతుకు నందనవనమౌతూంది.

ఆశ కోటిదివ్వెల వెలుగై మదిన నర్తిస్తూంది.

జీవితం సెలయేటి పాటై గలగల పారుతూంది.

రామయ్యగారి ముఖంలో ఇదివరకటి బీదరికపు ఛ్ఛాయలు లేవు.

పెంకుటిల్లు పడగొట్టి డాబా చేసారు.

అడిగినవారికీ అడగనివారికీ లాటరీలో యాభైవేలు వచ్చాయని గర్వంగా చెప్పుకుని తలెత్తుకు తిరగ్గలుగుతున్నారు.

మునసబుగారు ఆయన్ని పిలిచి ఇపుడు సలహా లడుగుతున్నారు.

కరణంగారు రోజూ ఓసారన్నా వచ్చి క్షేమ సమాచారాలడగందే వెళ్ళటంలేదు.

ఊరి తగవుల తీర్పుకు ప్రెసిడెంటుగారు ఈయన్నే నియమిస్తారు.

o o o

రెండు సంవత్సరాల పైనే గడిచింది.

ఇంటి ముందు ఆగిన గుర్రబ్బండిలోంచి దిగుతున్న వ్యక్తిని పరికించి చూసి వెంటనే గుర్తుపట్టారు రామయ్యగారు.

'రండి రండి' అంటూ ఇంట్లోకి పిల్చి ...వేసారు.

'పెద్దలు .... మీరూ కూర్చోండి' అంటూ రామయ్యగారు కూర్చున్న తరవాతే ఆ వచ్చిన వ్యక్తి కూర్చున్నాడు.

కుశలప్రశ్నలు అడిగి తెలుసుకుని, తుఫాను భీభత్సం మీద, రాజకీయప్రహసనాల మీద, పంటల నష్టంమీద, కరువు కాటకాలమీద తదితర విషయాలన్నింటిమీదా చర్చించాక అసలు విషయానికొచ్చాడా వ్యక్తి.

ఆయన రాకతోనే అర్థమయిన రామయ్యగారు "పిల్లలకి సంబంధాలు చూస్తున్నాం—ఇంకా ఏవీ కుదరలేదు" అన్నారు పొగాకుచుట్ట చుట్టుకుంటూ.

"సంబంధాలు చూడటమేవిటండీ!" అని ఆశ్చర్యం వ్యక్తంజేసి 'రెండు సంవత్సరాల క్రితం పెళ్ళిచూపులకనొచ్చాం....ఏదో పదివేలు కట్నమడిగామనుకోండి — మీరన్నా మరో మాట మాట్లాడలేదు .... పెద్దలు, అనుభవజ్ఞులూను-మీవంటివారి సంబంధం కాలదన్నడం భావ్యంటండీ....మీ అమ్మాయిని మా ఇంటి కోడలిగా జేసుకుందామనే సదుద్దేశంతోనే వచ్చాను'' అన్నాడు అతివినయం పలకబోస్తూ.

రాధారాణి గుమ్మాని కానుకుని నిర్లిప్తంగా వింటూ నిలబడింది.

తల్లి కాఫీ కలిపి వచ్చిన ఆ పెద్దమనిషికీ, రామయ్యగారికీ యిచ్చి తను ఇవతలగా కూర్చుంది.

చుట్ట వెలిగిస్తూ 'మీకు మా సంబంధం నచ్చలేదనీ, మీ అబ్బాయికి వేరే సంబంధాలు చూస్తున్నారనీ విన్నానే' అన్నారు రామయ్యగారు.

"అబ్బెబ్బే —అదేంలేదే! .... మీకే మా సంబంధం నచ్చలేదేమోనని అనుకున్నాం. మాకూ వాడొక్కడే బిడ్డ .... మీకూ ఒక్కగానొక్క కూతురాయె....మీ సంబంధం కలుపుకోవడం మా కెంతో ఆనందం....ఇంతెందుకు నేను వేరే సంబంధం చూడబోతే మావాడు ససేమిరా ఒప్పుకోలేదు. మీ అమ్మాయిని తప్ప వేరే అమ్మాయిని చేసుకోనని భీష్మించుక్కూర్చున్నాడు. కట్న కానుకల ప్రసక్తి లేదనుకోండి—మీ రెంతిస్తే అంత....మీరు 'ఊ' అంటే ముహూర్తం పెట్టించేద్దాం. ఏవంటారు?" అన్నాడు కుతూహలంగా ముందుకు వంగి.

"మాదేముంది — మా అమ్మాయి ఇష్టం' అన్నారు రామయ్యగారు పెళ్ళాం ముఖంలోకి చూస్తూ.

"అవుననన్నగారూ!" అంది తమకేం అభ్యంతరం లేదన్నట్లుగా.

ముగ్గురూ గుమ్మంలో నిలబడ్డ రాధారాణి కేసి ప్రశ్నార్థకంగా ఒకేసారి చూస్తారు.

అప్పుడు తను ఓమాదిరిగా నచ్చిందన్నారు. ఇప్పుడు తనను తప్ప మరెవ్వరినీ పెళ్ళిచేసుకోనంటున్నాడని అన్నారు. అప్పుడు పదివేలు కట్నంగా అడిగారు. ఇప్పుడు 'ఎంతిస్తే అంత' అంటున్నారు.

ఇప్పుడు తనకి డాబా వుంది. కావలసినంత డబ్బుంది. ఊరి చివర సుబ్బయ్యనాయుడిగారి ఉరుకుంబాల కొబ్బరితోట తనపేర్నే వుంది.

వీళ్లు డబ్బు మనుషులు. తన గురించి పదిమందీ చెడుగా చెప్పుకుంటున్నా తెలిసే వచ్చారు. అంటే తండ్రి నయభయాలకి తన మెడలో తాళి కట్టనున్నాడన్నమాట.

తనకావల్సింది యిలాంటి మగసిడే.

అందరి ముఖాలకేసి ఒకసారి చూసి "నా కిష్టమే" అని లోపలికి వెళ్ళిపోయింది.

o o o

పెళ్ళికి ముందే కర్ణుణ్ణి కన్న కుంతీదేవి పతివ్రతే.

పెళ్ళికి పిదప దేవతల ద్వారా ఐదుగురు బిడ్డల్ని కన్న ఆ కుంతీదేవే పతివ్రత పతివ్రత.

అవును పతివ్రతే.

ఆ మహా పతివ్రతను పరిణయమాడిన పాండురాజులాంటివాడే తన మొగుడు.

ఆ మొగుడిచేతనే పెళ్ళికి ముందు తను కన్న ఇద్దరు బిడ్డల్నీ అనాధ శరణాలయంనించి యింటికి తెప్పించుకుంది.

రాధారాణి ఖరీదైన పెద్ద మనుషులకు 'ఫామిలీ ఫిగర్'—

ఐనా

రాధారాణి పతివ్రత.

పతివ్రతే—

మహా పతివ్రత. □

